# పశ్యేమ శరదశ్శతాం

జీవితంలో ఒక్కో అనుభవాన్ని జన్మాంతం మరిచి పోలేం. ఈ మరచిపోలేక పోవడమనేది ఆ అనుభవం తాలూకు గొప్పతనంమీదే ఆధారపడుతుందా అంటే — అదిగాక పోవచ్చు. లేదా మన మానసిక నైశిత్యంమీదనే ఆధారపడు తుందా అంటే—అదీకాకపోవచ్చు! ఏమైనా ఈ జ్ఞాపకాలన్నవి మానవుణ్ని—మానసిక శాంతికి దూరంచేస్తాయి. అలజడీ, ఆందోళనా ప్రేరేపిస్తాయి.

చల్లని వెన్నెల రాత్రులలో కూర్చుని అందాలమందానిలాల్ని అనుభవిస్తున్న సమయంలోకూడ ఏవో పురాస్మృతులు హృదయాన్ని కలచివేస్తూనే వుంటాయి. తీయని

దుఃఖంతో తీరని పరిదేవనతో మనుగడనే అస్త వ్యస్తం చేస్తూంటాయి!

శరశ్చంద్రికలు మరీని, ఏవో జ్ఞాపకాన్ని రెచ్చగొట్టి—నా హృదయ శాంతిని దోచుకుంటూనే వుంటాయి...నిజానికి వెన్నెల చూసినప్పుడల్లా నాకావిషయమే జ్ఞాపకం వస్తుంది. ఎన్నేళ్ళు గడిస్తేనేం గాక—

ఆవేళ నేను — ఆ వూరు బస్సుస్టాండులో నించుని వున్నాను. బస్సుకోసం నిరీక్షిస్తున్నాను. అత్తవారింటికి తొందరగా చేరుకోవాలనే ఆందోళనలో వున్నాను. ఇంకా బస్సురాలేదు. గంటదాకా వచ్చే సూచనలు కనపడ్డంలేదు. హరి భగవంతుడా! ఎలాంటి ఇక్కట్లు కలిగిస్తున్నావురా!— అనుకున్నాను. ఎదురుగావున్న సోడాకొట్టుదగ్గర గెడమంచీ వంటి బెంచీ కనిపించింది. దానిమీద కూర్చోవచ్చుకదా అని సమీపించాను. అప్పటికప్పుడే ఆ బల్లమీద—కొంచం స్థూలంగావున్న ఆజానుబాహుడొకాయన కూర్చున్నాడు. నేను దగ్గరకు రావడంచూసి, కాస్త జరిగి—మర్యాదగా 'రండి—కూర్చోండి' అన్నాడు.

ఆయన్ని నే నెప్పుడూ చూడలేదు. అంతచొరవగా, అంత మర్యాదగా, బొత్తిగా పరిచయంలేని నన్నాయన ఆహ్వానించాడంటే—దానికి కారణం నా వ్యక్తిత్వంలోని గొప్పతనం గాక మరేమిటి? — నిశ్చయంగానే అనుకున్నాను. ఇలాంటి

చిన్న విషయాలపట్లకూడా అల్పసంతోషమూ, పేలవమైన సంతుష్టి—కలుగకపోతే బ్రతుకు వెళ్ళమార్చడమే కష్టమై పోతుంది కాబోలు!—లేకపోతే, ఎంత పరిచయంలేని వ్యక్తినైనా సాదరంగా పలకరించే ఆయన ఔదార్యాన్నే అర్థం చేసుకోగూడదూ ?

"ఏవూరు వెడతారండీ ?" అన్నారాయన.

చెప్పాను. ఏం చేస్తున్నానో అడిగారు. కథలూ అవీ రాస్తూంటానని కూడా చెప్పాను. ఆయనకేమీ అర్థంకాలేదు. "అంటే...?" అన్నారు; మొహం అదోలా మార్చారు.

"కథలూ, కవిత్వమూ రాస్తూంటానండీ!" అన్నాను. గొప్పగానే అన్నాడు.

"ఓహో...అదా...! అదేనా మీవృత్తి...? ఇంకేమైనా వుందా ?"

హరి భగవంతుడా! రచయితలలో గుట్టు ఈయనకి కూడా తెలిసిపోయినట్టుందే! ఇంక దాస్తే లాభంలేదనుకున్నాను. యథార్థం చెప్పేశాను: "కాస్త భూమీ, పుట్రా వుందిలెండి" అని. అప్పటికిగాని ఆయనకి సంతృప్తి కలగనేలేదు.

ఆయనెక్కడికి వెడుతున్నారో కనుక్కున్నాను. ఏం చేస్తూంటారో తెలుసుకున్నాను. ఆయన్ని చూడగానే నేను అంచనా వేసింది తప్పు కాకపోయినందుకు సంతోషించాను.

ఆయన మాట ఏభై యకరాల భూకామందు. భూమి ఆ వూళ్లోనేవుంది. అంటే రెండు పంటలు పండే సుక్షేత్రమైన డెల్టా భూమేనన్నమాట! ఆయన పేరు ముద్దులూరి ముత్యాల రావుగారు. మనిషి ఘాంచి నిండైన విగ్రహం. చక్కని ముఖ వర్చస్సు. చామనచాయగావున్నా, అందమైన మీసకట్టూ, విశాలమైన నుదురూ, మొత్తానికి కళకాంతులుగానే వుంటాడు మనిషి! గ్లాస్కో పంచ కట్టుకున్నాడు. డబుల్ కఫ్స్, తెల్ల పాప్లిన్ షర్టు వేసుకున్నాడు. జలతారు గోరంచు ఖండువా వేసు కున్నాడు. ఏభయ్యేళ్ళు దాటేవుంటాయేమోగాని — మనిషి మటుకు నడివయసులో వున్నట్టే వున్నాడు.

ఆయనా నేనూ లోకాభిరామాయణం మాట్లాడుకుంటు న్నాము. మా సంభాషణలో ఎక్కువ భాగం ఆయనే మాట్లాడుతున్నాడు. ఆయన ప్రశ్నలకు మాత్రమే ముక్త సరిగా సమాధానంచెప్పి, సాధ్యమైనంత శ్రద్ధగా వింటున్నాను. మా సంభాషణ మంచి రసకందాయపట్టులో సాగుతోంది అవునా? ఉచితానుచితజ్ఞానం లేకుండా వెధవ ముష్టివాళ్ళు— ఎప్పుడు పడితే అప్పుడే—ఎక్కడికి పడితే అక్కడికే సిద్ధమవు తారు! ఎవర్తో ముష్టిది ... చేతులూ వొళ్ళూ కాలి, బొల్లి బొల్లిగా మచ్చలుపడ్డ పొట్టి ముసల్ది నేరుగా మా దగ్గరకే వచ్చేసింది. 'బాబూ ధర్మం!' అంటూ తన దీనాలాపం ప్రారంభించింది. అసహ్యమైన తన మురికి చేతులు యించు

మీంచు మా ముఖాలమీదికి చాచింది. మా సంభాషణ కంత రాయం కలిగించింది. అంచేతనే ముత్యాలరావుగారికి ఠిమ్మెత్తి నట్టుగా కోపం వచ్చింది. గట్టిగా గొంతెత్తి ఒక్క కసురు కసిరా రాయన. దాంతో పాపం ముసల్ది బిక్క చచ్చిపోయింది. మెల్లిగా అక్కడినించి వెళ్ళిపోయింది.

"లేకపోతే...ఉత్త వెధవలండీ!...అంతా మోసం... గదా! మనమిలా వుండిపోయామనే వాళ్ళ ఏడుపు...ఈముసల్ది వుంది చూశారూ!" అన్నారాయన.

చూశాను...ఆ ముసల్ది మెల్లగా వెడుతూ వెనక్కి తిరిగి మమ్మల్ని కోపంగా చూస్తోంది ... ఆయన కండువా మడత సర్దుకుంటూ నా ముఖంలోకి చూస్తున్నారు...ఆయన చెబు తున్నంతసేపూ చిన్నగా నవ్వుతూ ఆయన ముఖాన్ని పరిశీలి స్తూనే వున్నాను.

మళ్ళీ ఆయనే ప్రారంభించారు.

"ఈ ముసిలిముండ వుంది చూశారూ! నా చిన్నప్పటి నుంచీ యిలాగేవుంది ... ఇది పాకీది. దీని వయసులో ఎలా వుండేదో మనకు తెలియదనుకోండి ... ఒక గొల్ల కుర్రాణ్ణి తగుల్కొంది. పద్దెనిమిది కాసుల పట్టెడ ఇచ్చేసింది. వాడికీ దీనికీ ఏం గొడవ వొచ్చిందో మరి ఒకనాడు యిది నిద్రపోతూ వుండగా యింటికి నిప్పంటించి లేచి చక్కాపోయాడు. ఆపోవడం పోవడం వాడు రంగం పోయాడట'' అన్నారాయన.

మొత్తానికి గండం గడిచి బైట పడిందన్నమాటే గాని ఆనాటినుంచే బొత్తిగా నిరాధారపు పక్షిలా తయారై వుంటుం దన్న విషయం స్పష్టపడుతూనేవుంది. మరి ఇంత దిక్కుమాలి నదై, ముష్టికి తప్ప మరెందుకూ కొరగాకుండా పోవడం ఎలా సంభవించిందో ముత్యాలరావుగారు వివరించలేదు. కాని ఆయన నిర్ణయం మాత్రం కొంతవరకూ ఆలోచనార్హంగానే కనిపిస్తోంది! ఆయన ముష్టిదాని కథ ముగిస్తూ అన్నారుకదా; "ఉన్న లొడ్డూ లొసుగూ వాడి యదానికొట్టి, ఈ వెధవ పీనుగ యిలా తయారైంది. ఒళ్ళు కామరమెక్కితే ఏమవు తుంది?" అని.

కాని యిలాంటి ఘోరాలన్నీ ఒళ్ళు పొగరెక్కితే జరిగినవేనా అని అడుగుదామనుకున్నాను. ఆయనతో నాకు వాదనఎందుకని ఆ ఆలోచనను అరికట్టాను. కాని నామనసులో మాత్రం ఏదోబాధ కలక్కపోలేదు — పాపం! వాళ్ళ ప్రేమకు విఘాతం ఎందుకు కలిగిందో, ఆ మనిషిని ఇంటితో సహా తగులబెట్టేసేటంతటి రాక్షస ప్రవృత్తికి వాడెందుకు దిగవలసి వచ్చిందో వివరంగా ఆయన చెప్పలేదు. బహుశా అలాంటి జీవిత వివరాలన్నీ కాలగర్భంలో కలిసిపోయి, ఆయన వరకూ సహితం వచ్చివుండరు. ఏమయితేనేం? సమాజంలోని వ్యక్తులు పరస్పరం మోసం చేసుకుంటూ బ్రతకడం అనేది ఈనాటిదే కాదన్నమాట!

ఆయన ఏదేదో చెబుతూనే వున్నారు. నాకంటే ఆయన కనీసం ఇరవై ఏళ్ళయినా పెద్దవారై వుంటారు. అలాంటి ముత్యాలరావుగారు తమకున్న లోకజ్ఞాన మంతట్నీ వినియోగించి చెబుతూంటే నేనెలాగ అశ్రద్ధ చేయగలను? జాగ్రత్తగానే వింటున్నాను. సంభాషణ జోరుగానే సాగుతోంది.

నా వెనుక దిక్కునుంచి ట్రాఫిక్కు జనాల రణగొణ ధ్వనులు జోరుగానే సాగుతున్నాయి. కార్లు, బాడుగబళ్లూ, బస్సులు వగైరాలన్నీ మూకుమ్మడిగా చేసే కఠోరశబ్దాలు... శృంగాటకాధికారి పోలీసు మధ్య మధ్య వూదే ఈలలు ... అంతా గోలగోలగా వుంది. దురదృష్టవశాత్తూ అది రైల్వే జంక్షనుకూడాను! గూడ్సుబళ్ళూ, కాలీ యింజన్లూ ఆవిరి విడిచే ఆర్భాటంతో మా చెవుల్ని చిత్తుచేస్తున్నాయి.

౨

ఆయనా, నేనూ ఒకే బస్సుమీద వెళ్ళాలి. మాబస్సు యింకా రానేలేదు. అలాగే కూర్చుని పిచ్చాపాటీ చెప్పుకుంటూనే వున్నాం. నాకు వెనుక దిక్కునుంచే సాగుతున్న యిన్ని శబ్దాల్ని చీల్చుకుని ఎవరిదో మొద్దుబారిన కంఠం ఇంత సేపటినుంచీ వినిపిస్తూనేవుంది.

"దండ మొక్కటి నీకు దశరథ వరపుత్ర
రెండు దండంబులు పుండరీక...
మూడు దండంబులు మునిజనవందిత
నాల్గు దండంబులు నళిన నేత్ర..."

అంటూన్నదా అపస్వర భూయిష్టమైన కంఠంతో. చదవడానికీ, పాడడానికీ మధ్యగల వికృత ఫణితిలో — సాగుతున్న విచిత్ర నాదం నా చెవుల్లో చొరనారంభించింది. అంత దుర్భరంగావున్నా ఆస్వరాన్ని కల్గిస్తున్న జీవిని చూడాలనే కాంక్ష నాలో పెల్లుబుకుతోంది. ఆకర్ష వంతంగా లేని విషయాల కోసంకూడా చిలిపి మనస్సు ఎందుకిలా ఆదుర్దాపడుతుందో తెలీదు. ఎన్నేళ్లు వస్తున్నా బుద్ధికి చపలత్వం పోదుకాబోలు.

పెద్దవాడు కాబట్టి ఆయన మందలించాడుకూడా! "అకేముంది–ఇలా చూడండీ!" ... ఈ పేపర్లో 'ప్రపంచ శాంతికై భారతదేశ ప్రతిపాదన అంటున్నాడుకదా ... అసలు దీనికి అర్థమేమిటా అని? శాంతేమిటండీ వాళ్ళ మొహం. అసలు మనసుల్లో శాంతనేది వుండాలిగాని ... చూశారూ! యుద్ధంవల్లనే మనదేశం బాగుపడింది. మొన్నయుద్ధం జరిగిందా ఎన్ని కుటుంబాలు బాగుపడ్డాయి చెప్పండి?...అన్నాడాయన.

ఎందుకనో నా మనసు ఆ విషయంమీద కేంద్రీకరించే స్థితిలో లేదు. పాదరసంలాగ జారిపోతోంది!

"అయిదు దండంబులు అమరేంద్రవందిత
పదియు దండంబులు పద్మనాభ!"

నా చెవుల్లో యిందాకటినుంచీ మారుమోగుతున్న అపస్వరం క్రమంగా దగ్గరవుతోంది. ఒక్కొక్క వాక్యమే

పూర్తిచేస్తోంది. కంఠం బిగ్గరవుతోంది. అయినా బుర్ర వెనక్కి త్రిప్పి చూడ్డానికి ధైర్యం చాలడంలేదు. నా ఎదురుగా కూర్చున్న ముత్యాలరావుగారు చెప్పేది వినకుండా పరధ్యానం వహిస్తే — గట్టిగా కోప్పడతాడేమోనని భయమేసింది. నా కెదెక్కడి అస్వతంత్రత వచ్చిపడిందిరా భగవంతుడా!

"నూరు దండంబులు నుతజన వందిత
వేయి దండంబులు వేదవేద్య!..."

స్వరం దగ్గరవుతున్నకొద్దీ వెనక్కి చూడ్డానికి స్వాతంత్ర్యంలేని నా బుద్ధికి భయంకరమైన స్వరూపమేదో పొడగట్టుతోంది...హమ్మయ్య! నేను వెనక్కి తిరగవలసిన అవసరం లేదు; ఆయనచేత చివాట్లు తినవలసిన ప్రమాదమూ తప్పింది! ఆ కఠోరస్వరం, స్వరూపం దాల్చినదై — ఎదురుపడింది.

'లక్షదండంబులు పక్షీంద్రవాహన...
కోటి దండంబులు కోమలాంగ!"

అంటూ చదువుతూ ప్రత్యక్షమయ్యాడొక బిచ్చగాడు! మొదటి వాక్యం చదువుతున్నపుడు ముత్యాలరావుగారికేసి వినయంగా వంగి నమస్కారం చేశాడు. రెండవ వాక్యం పూర్తిచేయక మునుపే నాకుకూడా నమస్కారం చేశాడు. మనిషి నేననుకొన్నంత భయంకరంగాలేదు. ఎడమచేయి మణికట్టువరకే వుంది. కుడికన్ను ఒకే ఎర్రరంగు ముద్దగా మారి

పోయింది. నుదురు విశాలంగానే వుంది. మనిషి కురచగా వున్నాడు. తలకాయ మాత్రం కొంచం పెద్దదిగా వికృతమైన ఆకారంలో వుంది. పురుష లక్షణంగా మీసాలూ వున్నాయి. మోకాలు దిగేదిగని ఎర్రపంచ కట్టుకున్నాడు. రెండు జేబులుండే కాకీ యూనిఫారంచొక్కా తొడుక్కున్నాడు. నాలుగడుగుల కర్ర ఎడమ చంకక్రింద వుంది. కుడిచేతులో ఎల్యూమినిం పాత్రకూడావుంది. మనిషిని చూడగానే నాకప్పటివరకూ ఆ స్వరూపం గురించి కలుగుతున్న భయంకరమైన ఆలోచనలన్నీ తొలగిపోయాయి. ఏదో సౌమ్యమైన వాతావరణం నాలో ఆవరించింది. ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను; ఆ వృద్ధుడ్ని చూడగానే—ఏవో రహస్య వేదనలు ఆ చొక్కా క్రింద మూలుగుతున్నా యనిపించింది. తెలుసుకోవాలని కుతూహలంకూడా కలిగింది. వెంటనే అడిగాను; "ఏమండీ ముత్యాలరావుగారూ — ఈ ముసిలాడి గురించి మీ కేమైనా తెలుసునా ? అని.

"తాత ఏం చెబుదామనుకొన్నాడోగాని గొంతు సవరించుకుంటున్నాడు. పెదవులు తడుపుకుంటున్నాడు. మాట మాత్రం హఠాత్తుగా వినిపించింది; 'మీ కేమైనా మతిపోయిందా ఏమిటండీ! ఉచ్చం నీచం లేకుండా ఏమిటది ? ప్రతీ వెధవతోటీ మాట్లాడ్డమే !.. లెండి... లెండి కాఫీ కెళదాం !" అంటూ నా చేయిపుచ్చుకొని లాగుతున్నాడు ముత్యాలరావుగారు. "బాబ్బాబు ! నేను కాఫీ తాగను. నేనిక్కడే వుంటాను ...

మీరు వెళ్ళిరండి!" అన్నాను. ఆహ్వానాన్ని తిరస్కరించడం పాపం ఆయనకి తలతీసేసినట్టయింది. చాలా కోపం వచ్చింది. "సరే...అయితే, మీరిక్కడే వుండండి" అంటూ రుసరుస నడుస్తూ కాఫీహోటల్ వైపు వెళ్ళిపోయారు!!

పోనీలే కోపంవస్తే ఎవడికి? నాకుమాత్రం కోపం రాలేదా ఏం? ఎంతమాట అనేశాడు? తనతో మాట్లాడు తూంటేనే ఉచ్చమూ, ముష్టివాడితోమాట్లాడితే నీచమూనా? ఇలాంటి మనుషులతో కాఫీకి వెడితే మరెంత అధికారం చెలా యిస్తారో!... ఇదంతా మనసులోనే అనుకున్నాను.

నా మాటకేంగాని, ఆయన ప్రదర్శించిన వైఖరికి బిచ్చగాడు నిజంగా ఖిన్నుడైపోయాడు...!

## 3

"ఆయన గొప్పోడైతే ఎవడికిబాబూ! అలా మండి పడతాడేంటి!" అన్నాడు తాత. మనసులోవున్న కోపాగ్ని నంతటినీ చల్లగా ఈ మాటలద్వారా మాత్రమే వ్యక్తం చేశాడు.

"దానికేంలే తాతా, నువ్వేం అనుకోకుగాని...నీ పేరే మిటో చెప్పు?" అన్నాను. ఎంతో మర్యాదా, ఆప్యాయతా ప్రదర్శించాను.

"నా పేరేదైతేనేంలే బాబూ! – ఎదవ పేరు... నా బ్రతుకే దిబ్బయిపోయింది!" అన్నాడు తాత. గొంతులో

వేయిపుంది మూగజీవుల నిస్పృహా తారట్లాడుతూ వెలికుబికింది.

"అలాకాదు తాతా! చెబుదూ! అడుగుతున్నప్పుడు చెప్పకపోవడం తప్పుకాదూ?" అన్నాను. స్వంత తాతయ్య దగ్గర చనువు ప్రదర్శించినట్లే లాలనగా అడిగాను.

ఎందువల్లనో ఈమాటు తాత ప్రశాంతత వహించాడు. నా సందేహాలన్నీ నివృత్తి చేయడానికే పూనుకున్నట్టుంది!

"మాదసలు కాటూరివులపిల్లండి బాబూ! మా తాత మొల్లి ఎంకన్న— కాటూరివులపల్లి రాజావారి దగ్గర పారా జవాన్‌గా వుండేవాడు. మా బాబుకూడా ఆ నౌకరియే చేశాడు. ఎటొచ్చీ నాకే ఆ అదృష్టం పట్టలేదు..." అంటూ తన కథ చెబుతున్నాడు. ఆ ధోరణికి అంతరాయం కలిగించకూడదని మౌనంగా వింటున్నాను.

"మా బాబుకీ, నాకూ ఒక సంగతికాడ తగాదా వచ్చింది. నేను తర్వాత రంగం వెళ్ళిపోయానండీ!" అన్నాడు.

రంగం వెళ్ళిపోయిన సంగతి వినగానే పాకీదాన్ని దారుణంగా హత్యచేయడానికి పూనుకున్న ఆసామీ వీడేమైనా కాదుకదా! అనుకున్నాను. తీవ్రంగానే అనుమానించాను. పైగా వీళ్ళ యింటిపేరు మొల్లివారంటున్నాడు. మొల్లివారు గొల్లల్లోనే వున్నారు మరి! ఆ నేరస్తుడే తాతే అయితే మళ్ళీ ఈవూరే ఎందుకు వస్తాడు? ఏమైనా ఈపరిశోధనకీ ప్రస్తుతానికీ అట్టే సంబంధంలేదు గనుక మనసులోనే దిగతొక్కుకున్నాను.

"రంగంలో పెట్రోలుబంకుల కాడ పెట్టికొట్టు పెట్టుకొని గాజుల వర్తకం చేసుకునేవోణ్ణి. వ్యాపారం బాగా సాగేది బాబూ! డబ్బూ దస్కం కాస్త నిలవేసుకున్నాక, మన దేశం వచ్చి నా పెళ్ళాం బిడ్డల్ని తీసుకువెళ్ళేను. కాలం సుఖంగానే గడిచిపోయింది. డబ్బుకూడా బాగానే సంపాదించాను. మన దేశం వచ్చేసి ఇల్లూ, పొలమూ కొనుక్కుందామనుకున్నాను. అలా వచ్చేసినా బాగుండును! హుఁ! నా రాతిలావుంటే అలా ఎందుకు వస్తాను? దిక్కుమాలిన ఆశకదా! ఇంకా సంపాదిద్దాంకదా అనుకున్నాను బాబయా!'' అని ఆగాడు తాత! కంఠం రుద్ధమైంది. తన కఠోరమైన ఏ అనుభవాన్నో పురస్కరించుకొని ఆశని తిడుతున్నాడు కాని ఆశ అంత నిందార్హమైంది కాదని పాపం అతనికేం తెలుసు? ఆశ అనేదే లేకపోతే జీవితాలే నిరాశా తమస్సులో కూరుకుపోయి భవిష్యత్తే లేకుండా పోతుందేమో! నిరాశ ఎంత చెడ్డదో, దురాశకూడా అంత చెడ్డగానూ పరిణమించి జీవితాన్ని దుఃఖ భాజనం చేస్తుంది కాబోలు!... తాత చెప్పకపోయినా ఈ ఘట్టంనుంచే అతని జీవితచరిత్ర మలుపు తిరిగి విషాదసాగరంలో కూరుకుపోయి వుంటుందని అర్థమవుతూనేవుంది. తాత గొంతు సంబాళించుకొని మళ్ళీ చెబుతున్నాడు.

"ఇంతలోనే మాయదారియుద్ధం దాపురించింది బాబూ! ఆయాళ రంగంలో జనమంతా తొక్కిళ్ళాడిపోతున్నారు.

చెట్టంత కొడుకండి! ఆడాయాళ పొద్దుట్నుంచీ కొట్టుమీదే వున్నాడు. నేనప్పుడే మద్దినాళ్ళ భోజనంపట్టుకొని కొట్టుకాడికే వచ్చాను. కూటిముంత పుచ్చుకొని కొట్టుబడ్డీ కిందికి దూరి ఆడు అన్నం తింటున్నాడు. నేను కొట్టుమీద కూర్చున్నాను. టీ తెప్పించుకున్నాను. ఎడమపక్కకి తిరిగాను. ఎడమ చేత్తో గ్లాసుపుచ్చుకొని నోటికాడికి తెచ్చుకున్నాను. ఇంతట్లోకే సైరను కూసింది, ఎందుకో అనుకున్నామండి! కూసీ కూయడమే తడవుగా పెట్రోలుబంకులమీద బాంబులు పారేయడం దబదబ అన్నీ కూలిపోవడం— అంతా ఒక్క క్షణంలో జరిగి పోయిందండి!... నాకు మళ్లీ తెలివొచ్చేసరికి ఆసుపత్రిలో మంచంమీద పడి వున్నాను. ఇక్కడీ ఎడంసేతికి కట్టుకట్టి వుంది. కుడికన్నుమీద కూడా పెద్ద కట్టు కట్టేశారు. ఒళ్ళంతా హూనమై పచ్చిముద్దలాగుంది. జొరం కాస్తోంది. కన్నుకాడా సేతికాడా ఎంత బాధగావుందో చెప్పలేనండి! ఎడం కన్ను తెరచి చూచేసరికి అంతా అయోమయంగా వుంది. అక్కడున్న వాళ్ళనందర్నీ అడిగాను— మా అబ్బాయి ఏమైపోయాడని!' ఆడి శరీరమెక్కడా గుర్తు దొరకలేదట బాబూ! ఏమైపోయాడో ఏటో... ఇంటిదగ్గరాళ్ళ సంగతు లప్పటికీ యిప్పటికీ ఏమీ తెలవనేలేదు. ఏమయ్యారో...!" అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు తాత.

అసలు తాతచెప్పిన ఈ కథ ముత్యాలరావుగారుకూడా వినవలసింది! అతని దీనగాధ వింటూంటే నాకుమాత్రం దుఃఖ

మాగిందికాదు. ఆయన వాక్యం జ్ఞాపకం వచ్చింది నాకు. ఆ వాక్యం ఈ తాతతో చెబితే? ... ఎంత రాద్ధాంతం జరిగి వుండును? యుద్ధంవల్ల ఇలాంటి నిర్భాగ్యజీవు లెంతమంది శాశ్వత దుఃఖంలో ఘూర్ణిల్లిపోతున్నారో ఎవరు లెక్కవేయ గలరు?

"సరేతాతా, ఏం చేస్తాం? లోకమంతటికీ వచ్చింది కదా ముప్పు! ... ఇంతకీ నీ పేరేమిటో చెప్పావుకాదు" అన్నాను. తాతను దుఃఖంనుంచి కొంచం అనునయించగల నేమో ననుకున్నాను. మళ్ళీ అతనికి జీవితంపట్ల ఆశకల్పించ గలనేమో, అన్నదే నా వెర్రిఆలోచన!

"నా పేరు 'మొల్లి వెంకటసామి' బాబూ!" అన్నాడు. తన తాత పేరు వెంకన్న అయినప్పుడు అతని పేరు కూడా అలాంటిదేదో అయివుంటుందని నేనాలోచించనేలేదు. ఆ సమయంలో నా యింగితం ఏమైపోయిందో నాకే తెలియదు.

"సరే, నువ్వు మళ్ళీ ఎలా వచ్చావ్?" "ఎలావచ్చాను బాబూ, అందర్నీ పొట్టపెట్టుకొని దెయ్యంలాగ బ్రతికున్నాను. ఆ గవర్నమెంటోరే నన్ను పెన్న పట్నం తీసుకొచ్చి దిబెట్టేశారు...ఇలాగే అడుక్కుంటూ ఈ వూరొచ్చాను. ఇంకే ముందిబాబూ, నాకీ ముంతా కర్ర తప్పితే!" అన్నాడు దుఃఖంతో ఉండచుట్టుకుపోతూ వెంకటస్వామి.

సుందరమైన ఈ లోకాన్ని తనకు మిగిలున్న ఒంటి కన్నుతో చూస్తున్న అతనికి సర్వత్రా చీకటి మాత్రమే కని పిస్తోంది. అలాంటి సన్నివేశం ఎదురైనపుడు ఎవరుమాత్రం దుఃఖోపశమనం చేయగల్గుతారు? వేదాంత సంస్మరణం తప్పితే మార్గాంతర మేముంది? కనకనే అన్నాను "చూడు వెంకట స్వామీ! అంత నిరాశపడితేఎలాగ? ఈ లోకంలో ఎవరు మాత్రం వేయి సంవత్సరాలు జీవిస్తారులే! కష్టసుఖాలు ఎవరికీ తప్పవాలాయితాతా?" అని.నా కంఠం సానుభూతితో బొంగురు వోయింది. అంతకన్న ఏమీ చెప్పలేకపోయాను.

"అది కాదు బాబూ! నా కుటుంబం వేయి సంవత్సరాల పాటు మన దేశంలో తప్పకుండా బ్రతుకుతుందనే అను కున్నాను. అంతేగాని చెట్టంతకొడుకు కూలిపోతాడనీ, నా కుటుంబమంతా నాశనమై పోతుందనీ ఎరవనుకున్నాను బాబూ!' అన్నాడు దీనంగా.

"నిజమే మరి! దేముడు ప్రతికూలించాడు." వేదాంత సారం వంటపట్టిన ప్రవక్తలా అన్నాను. అతని మనసును సుఖంవైపుకు మళ్ళించాలనే నా ప్రయత్నం!

"సరే బాబూ! ఏం చేస్తాం...నాకు సెలవిప్పిస్తారా!" అన్నాడు.

సెల విప్పించకేం చేస్తాను? పర్సుతీసి పావులా చేతిలో పెట్టాను. కుడిచేత్తో పుచ్చుకున్నాడూ ఎడమకంటి దగ్గరగా తీసుకున్నాడు పరిశీలనగా చూసు కొన్నాడు.

"చిల్లర లేదు బాబూ!" అన్నాడు.

"చిల్లర అక్కర లేదులే, తీసుకో!" అన్నాను.

"అదేమిటి బాబూ...ఏదో... మనసున్న మారాజులు గనక గాని... ఈ గోడు ఎవరు నమ్ముతారు బాబూ!" అన్నాడు.

ముత్యాలరావుగారింకా రాలేదు. త్వరగా వస్తే బాగుండును. పాసింజర్ బస్సుకూడా యింకా రాలేదు.

వెంకటస్వామి జీవితకథ ముత్యాలరావుగారితో చెబితే బావుండుననుకొన్నాను. ఇదికూడా పచ్చిమోసమే అంటా రేమో చూడాలనిపించింది.

౪

గాలి మారింది. ఎర్రెటి దుమ్ము రేగుతోంది. బట్ట ఖరాబు చేసేటట్టు కనిపిస్తోంది...నా అదృష్టంపండే సూచనలాగ నేనెక్కబోయే బస్సు చక్కావచ్చింది. ముత్యాలరావుగారింకా రాలేదేం చెప్మా? ఖర్మైన తోలుసంచిని నా కాపలాలోనే వదలిపెట్టారాయె!

ఎలా వచ్చారో తెలియదు, రాడనుకుంటూండగానే వచ్చేశారు! "రండి, రండి పంతులుగారూ! టిక్కెట్లు తీసుకున్నాను" అన్నారాయన.

"సరి, సరి! ఎప్పుడు వచ్చారు, ఎప్పుడు టిక్కెట్లు తీసుకున్నారు?" అన్నాను.

"మీరా ముసలివెధవతో మాట్లాడుతున్నారుగా... నేనలా మీదికి వెళ్ళి దారిలోనే ఎక్కేశాను టిక్కెట్లు దొరకవేమోనని" అన్నారాయన.

మనిషి ఎంతో మర్యాదైనవారు. మనసు ఎంతో మంచిది. స్నేహంపట్ల ఎంత బాధ్యత... సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరం బస్సులో ఎక్కాం.

"ఇంతకీ మీరు కాఫీ తాగిగారా" అన్నారాయన.

"అబ్బే...! నాకు కాఫీ అలవాటులేదండి!" అన్నాను. కాఫీటైము దాటడంవల్ల అప్పటికే తలనొప్పి దంచుతోంది. కాని లోకువయిచ్చేస్తే ఎలాగ? అందుకని ముందాడిన అబద్దానికి మరో అబద్ధాన్ని జతపర్చాను. ఆయన చేతిలో పేపరు తీసుకున్నాను. యథాలాపంగా చూస్తున్నాను. ప్రపంచ శాంతి స్థాపనకై 'భారతదేశ ప్రతిపాదన' అన్న పతాక శీర్షిక కంటపడింది. మొల్లి వెంకటస్వామి జీవిత చరిత్ర కనుల ఎట్టఎదుట తారట్లాడ నారంభించింది. ఈమాటు మిత్రశ్రీ ముద్దులూరి ముత్యాలరావుగారిని సూటిగా ఒకప్రశ్న అడుగుదామనిపించింది. "యుద్ధంవల్ల ఎన్ని కుటుంబాలు బాగుపడ్డాయండీ" అని. మొల్లి వెంకటస్వామి జీవితచరిత్ర శ్రీవారికి నివేదించాలనిపించింది. ఇదంతా నాఉబలాటమేగాని ఆయనతో ఇవన్నీ వాదనకి దిగే ధైర్యం చిక్కనేలేదు నాకు! తీరాచెపితే మాత్రం ఆయన నమ్మేవాడా ఏమన్నానా? నమ్మడే అనుకో

యుద్ధంవల్ల ప్రపంచానికి వినాశనమేగాని లాభంలేదనేసత్యాన్ని అంగీకరిస్తాడు గనకనా? ఇంతా వితర్కించి చివరికి మౌనం వహించాను. పేపరు చదువుకుంటున్నాను.

బస్సు తన విధులన్నీ నెరవేర్చుకుంది. అవసరాలు తీర్చుకుంది. శరవేగంతో బయల్దేరింది.

మధ్యమధ్య ఆయన ఏదేదో సంభాషిస్తూనే వున్నారు. నేను మౌనంగానే సమాధానాలిస్తున్నాను. పెదవి మెదిపితే పొరబాటున, వెంకటస్వామి విషయం ఎక్కడ ప్రస్తావించవలసి వస్తుందోనని! సాధ్యమైనంతవరకూ ఆత్మసంయమాన్నే అలవర్చుకుంటున్నాను.

ఏమైతేనేం వాయువేగ మనోవేగాలతో బస్సు నా గమ్యస్థానాన్ని చేరుకుంది. కండక్టరుతో చెప్పి బస్సునాపించుకున్నాను. మిత్రులు ముత్యాలరావుగారి వద్ద సెలవు తీసుకున్నాను.

"అవునుగాని...ఈ వూళ్లో మీరెవరింటికి వెడతారు?" అన్నారు. బస్సులోంచి యువతలకు బురప్రవంచి చిరునవ్వుతో చూస్తున్నారాయన.

ఫలానావారు మా మామగారని ఆయనకు విశదం చేశాను.

"అరెరే! చెప్పారేకాదు; చూశారా! మీమామగారు మాకు ప్రాణ స్నేహితులు... మంచిపని చేశారు. తిరుగు

ప్రియాణంలో తప్పక దిగుతానులెండి, కలుసుకుందా" అన్నారాయన. మా మామగారు పేరుచెప్పేసరికి బ్రహ్మానంద పడ్డారు. స్నేహంపట్ల ముత్యాలరావుగారికుండే మమకారం అలాంటిది మరి.

నా బెడ్డింగు దించి కండక్టరు హుకూం జారీచేశాడు. బస్సు కదిలింది. ముత్యాలరావుగారు చేయి ఊపుతున్నారు.

నేనింటికి చేరుకున్నాను.

కిలారింపు నవ్వులతో శ్రీమతి ఆహ్వానవీణ మ్రోయించింది. ఇంటిల్లిపాదీ నా రాకకు ఆనందపడుతున్నారు. నాకు మాత్రం వెంకటస్వామి ప్రేరేపిత దుఃఖం కలతకలిగిస్తూనే వుంది!

కార్తీక పౌర్ణమి; తెల్లని మతాబువెన్నెలల్ని భూలోకానికి పంచుతోంది. మనసుల్లో ఆహ్లాదాలతీగలల్లుకుంటున్నాయి. మేలుకున్న మనసు కలలుకంటోంది. అవును! ఈ సుందరతర లోకంలో జన్మించిన మనం ఎంత పుణ్యాత్ములం! మనస్సు సహజంగానే ఆశలూరిస్తున్నది...నూరు శరదృతువుల అమృతాన్ని చవిచూడాలి! తీయని రాత్రుల ఆనందాన్ని అనంతంగా గ్రోలాలి!! వేయి సువాసనల వాహినిలో జీవితాన్ని పునీతం చేసుకోవాలి! హృదయం ఉవ్విళ్ళూరుతున్నది.

పడకగదికి ప్రక్కనుంచి రేరాణి ఘుమఘుమాయమానంగా గుబాళిస్తోంది. వేలాది పూవుల పులకరింపులతో

అలరించుకుంటోంది. జీవిత మొక్కసారి శతపత్రసుందరమై వెలిగిపోతుంది.

ఇంకా శ్రీమతి రాలేదు.

మానసికాంతరాల ఏకాంతంలో మొల్లి వెంకటస్వామి మాత్రం నిర్జీవ దీపకళికలా మెదులుతూనే వున్నాడు !!!

[ఏప్రిల్ 1వ తేదీ రాత్రి గం॥ 9–15 ని॥లకు ఆకాశవాణి (విజయవాడ) నుంచి ప్రసారితం]

[ఏప్రిల్ – మే – అభ్యుదయ 1958]

— సమాప్తం —

